# శ్రీ వేధవల్లి తాయారమ్మాళ్

రచయిత:

కవికొండల వెంకటరావు, బి. ఏ., బి. యల్.

["అంటే వాళ్లంతాకూడాఓయి! వెంబరివిత్తా! కొప్పులోపువ్వులు గుప్పెట్లో పువ్వులు మావి మావే, మీవి మీవే! మాదీ వీదీ అయ్యాది నాణ్యాలమారక మొక్కటేనోయి!' అని చిల్లఱ గిరాటేశారు."]

కన్నప్పనుబట్టి మహాదేవళం పెరిగినట్టే, చన్నప్పనుబట్టి మహాపట్నం పెరిగిన గాథ కూడా ఒకటివుంది. ఉందికాని ఆగాథ ఇప్పుడెవరికీ అక్కర్లేదు. ఇప్పుడు చన్నపట్నం అనే పేరుకన్న మెడ్రాసు అనేపేరే బాగా చలామణి అవుతూవుంది.

చన్నప్ప నెక్కడ వెదుకుదామన్నా ఆ పట్నంలో కనబడడు. మత్తేమైపోయినాడు? ఉత్తరాదికేసి కాశీపోయినాడా? దక్షిణాదికేసి రామేశ్వరంపోయినాడా? స్టీమరెక్కి రంగూన్ పోయినాడా? రైలెక్కి బొంబాయిపోయినాడా?—ఇలాగ్గా ఆలోచనపోయింది వోకానీ అద్దెఇచ్చి వోక్షణికం మదరాసు మరీనావొరే ఈజీచైర్లో చతికలబడ్డానో లేదో నాభావాంబరవీధిని- అలాగ్గా ఆలోచనపోయింది. ఆపాళంగా ఏలాపైకిలేచి ప్రత్యక్షమైనాడో చన్నప్ప సముద్రమ్మధ్య మంధరగిరిలా లేచి, తనకు మోకాలిబంటినీరే సముద్రమన్నట్టు, నడిచివచ్చేశాడు నాదగ్గరకు.

"నన్ను తల్చుకుంటున్నావు. ఎందుకు?" అన్నాడు చన్నప్ప. అంటే చెప్పొద్దూ ఏదో జవాబు నేను? "చన్నప్పా! నీవు పెద్దపెద్ద మేడలూ పెద్దపెద్ద మిద్దెలూ నిర్మించి, పేటలు వృద్ధిగావించి, విద్యాలయాలు సమృద్ధిగా మొలిపించి, తారురోడ్లను పూయించి, పెట్రోలు ఏఅంగలోపడితే ఆ అంగలోనే పోయించి, విద్యుద్దీపాలు ఏవింగులోపడితే ఆ వింగులోనే మెఱిపించి, ఇంతగా తంటాలు పడుతువున్నా నీపేరెవరూ ఈపట్నంలో చెప్పుకోరేంచేతనోయి! నీకొక్క శిలావిగ్రహం ఈనగరంలో వెలిసిందికాదేంచేతనోయి!" అని అడిగాను.

అంటే అన్నాడు చన్నప్ప. "నాయనా! నీవూ ఐహికభోగపరాయణుడివిలాగే నాకంటికి కనబడుతూవున్నావు. ఇంతదగ్గఱసా ఈసముద్రపువారకు వచ్చికూడా కేవలం కిందిచూపేగాని పైచూపు సంపాదించుకోలేకపోయినావు!" అని ఎటకరించినట్టు మాటాడాడు. నేను ఈజీచైరు వెంటనేదిగిపోయి యిసకమీద చతికిలబడ్డాను. చన్నప్ప నాప్రక్కనే కూర్చుని యిలాచెప్పేడు తనగాథ.—

"అసల్లో నేను బాగా లావుగావుండేవాణ్ణి. మంచి భోజనప్రియుణ్ణి. భేషైన సంపాదనపరుణ్ణి, ఇంకాఇంకా చెప్పొస్తే అఖిల విద్యా విశారదుణ్ణి, సకలగుణాభిరాముణ్ణి: ఇలా రెచ్చిపోతూవుండగా ఓపొద్దు చటక్కున నాకళ్లుపోయివూరుకున్నాయి. లోకమంతా 'అంతేకావాలి! మదాంధుడికి కళ్లూపోక వొళ్లూతియ్యక, వొక్షిటాకీగా ఎంతకాలం నడుస్తుంది?' అని అనుకోసాగారు. కర్ణా

కర్ణిగ్గా వారియూసు నాచెవిని సోకింది. సోకడం ఏమిటి? అనుభవానికి వచ్చేసింది. భాగ్యంపోయింది. బట్టపోయింది. వీధులంట కొఱగానివాణ్ణాయి, గంజివుందా నంజువుందా అని అడుక్కోవలసివచ్చింది. నేనొక్కణ్ణిఅయితే ఏలాగన్నా యేడవగలను. ఇంట్లో ఇల్లాలు! అది యిల్లువిడిచి యివలకురానసీది. ఇంట్లోకి తీసుకొచ్చి తనమొగాన్ని అన్నీ పెడితే ఎంతపని అయినా చేస్తాను అనీది అది. దాన్ని నట్టింట అలా మాడబెట్టి, నేను వీధిలో చెట్టునీడను కూర్చుంటేమాత్రం కూడికా అది?

అంచేత అది పనికాదనుకోని, దానితో ఒకసమయం చేసుకోవాలనుకోని. ఇలా అన్నాను. "మనం వొకరియింటిదగ్గఱకువెళ్ళి కూర్చోవద్దు. ఈవూళ్లో పార్థసారథిస్వామి వారిగుడి వున్నదే అక్కడకువెళ్ళి ఆగుడి ముందు గుడ్డపఱచుకుని కూర్చుందాం. వచ్చీపోయే అమ్మలక్కలువేసే డబ్బులూ దమ్మిడీలూ నీకూనాకూ తిండికి సరిపోతవి" అన్నాను. అంటే అది- ఆనాపెండ్లాం- పక్కన నవ్వి—"మంచి ఆలోచనే సెప్పారు! మునుపూ ముందూ మనం గుళ్ళోకివెళ్ళి గుమికీలూ కుమ్ములూతిన్నవి చాలకా యిప్పుడు మళ్ళీ ఆదరికి నన్నుతీసుకుని వెడతామనడం! మంచి మొగాళ్లేమీరు!" అని అంది. గుడీ, దేవుడూ అంటేనీకటువంటి భక్తివుంది కనుకనే మనం ఇలాఅయినాం అని లోలో అనుకోని, దాన్ని మఱేంఅనక, ఇంటనే అట్టేపెట్టి, నేను వొంటిగా నాకఱ్ఱతోతడుముకుంటూ, తోసుకుంటూ, తిరువళిక్కేణి శ్రీపార్థసారథిస్వామి వారి ఆలయప్రాంగణానికిబోయి అక్కడ బట్టపఱచుక్కూర్చున్నా.

కూర్చుంటే నాబట్టలో భక్తులు పడేసిన రూకలు, రూపాయలు, కాసులు, మొహరీలు, ఠంగుఠంగుమనిపడి నన్ను పరవశుణ్ణిచేసి పారేశాయి. కొంతసేపైనాక అవన్నీ యింటికి మూటకట్టి పట్టుకువెళ్ళి మా ఆవిడ ముందు పెడితినిగదా! అదిల్లా మూటనొక్కినోరునొక్కుకుని—ఇవేం రూకలు! ఇవేం మొహరీలు! జలగల్లాగు మెత్తగావుంటాయూ రూకలూ మొహరీలూ?—అంది. అంటే విప్పిచూడు అన్నాడు. అంటేచూచి—పువ్వులండీ! ఇవన్నీ పువ్వులండీ! పువ్వులు తిండికెలా పనికివస్తాయండీ? అవతల పారబోయండి!" అంది. అంటే పోనీ వాసన చూచుకొందాం. పువ్వులైతేమాత్రం పనికిరావుటే?" అన్నాను నేను. అంటే అది "ముందు ఆకలితీరాలి! నాకు చాలా ఆకలవుతోంది." అని ఆపువ్వులన్నీ వీధిలో, చేటతో దుమ్మెత్తి పారబోసినట్టు పారబోసి వూరుకుంది. నేనూ అదీకూడా ఆరాత్రి వుపవాసమే. ఒక్కపువ్వు నన్ను వాసన చూణ్ణిచ్చిందికాదు. తాను వాసనచూచిందిలేదు. తెల్లాఱిపోయింది.

మర్నాటిమాట? నిరాశ ఎక్కువ కాజొచ్చింది నాహృదయకోశంలో. అయినా ఇదంతా ఏదోమాయగా తోస్తుంది. గుళ్లో, వాళ్లు నాబట్టలో పడేసినప్పుడు పువ్వులైతే అవి ఠంగుఠంగుమంటవా? ఇందలి సత్యమేమిటో తెలిసికోవాలి అని మర్నాడు ప్రక్కన కూర్చున్న కళ్లున్న మామోలు బిచ్చగాణ్ణి వొకణ్ణి' కనిపెట్టు నాయనా! కాస్తంత! వాళ్లూవీళ్లూ నాగుడ్డలో పడేసేవి రాళ్లో రప్పలో రూకలో నూకలో' అని ప్రోత్సహించాను. వాడు చూచిచూచి వెఱ్ఱిగా 'రూకలేనోయి! కాసులేనోయి!' అని నాచెవిలో వూదేడు. 'బాగుంది' అని విఱ్ఱవీగుతూ మళ్ళీ అవన్నీ మూటగట్టుకొని క్రిందటిరేత్రిలాగే పట్టుకువెళ్ళి ఆడదానిముందు పెట్టె, 'ఇవి మార్చి పప్పూ, ఉప్పూ, అన్నీ సంబాళించుకు

రా!' అన్నాను. అది మళ్ళీ యథాప్రకారంగా మూటెత్తి నేలను పెడుతూ 'చప్పుడు లేదు, ఇవాళా చప్పుడు లేదు. మీ మూట మండిపోయిరి!' అంది. అంటే విప్పిచూడు! విప్పిచూడకుండా పేలకు!' అన్నానేను. అంటే విప్పిచూచిందై—'ఇవాళా పువ్వులే తగలేశావు!' అంది. అంటే 'మనకుప్రాప్తం పువ్వులే కామోసు? పువ్వుల్ని ఏంచెయ్యాలో ఆపనిచేసి చూదాం! మూచూదాం!' అన్నాను. 'మూచూడ్డంకాదు. అగ్గిముట్టించి ధూపం ఎగబీల్చు!' అంటూ పట్టుకుపోయి పెరట్లో గోతిలో నప్పెట్టి చక్కావచ్చింది. రెండో రాత్రి కూడా ఆసంపాదించి తెచ్చిన వాటిలోని వొక్కపువ్వూ నేనుగాని అదిగాని మూర్కోలేదు! పేర్కోలేదు!

మూడో రోజు వుదయం ఇఖ నేనుబడ్డ వ్యాధికి మందే లేదనిపించింది. అయినప్పటికీ ఏదో మహత్తుగావుంది ఈమహావిపత్తు అని తలపోసి యథాప్రకారంగా నా నమ్మకం కొద్దీ కోవెల గుమ్మంకాడ మళ్ళీ వస్త్రం పఱచుకూర్చున్నాను. కూర్చుని 'అమ్మా! తల్లీ! తండ్రీ! అప్పా! నాడెంగా నాణ్యాలూ తండులాలూ పడెయ్యండి. మరువం దమనం, మల్లెచామంతి, జాజి, రోజా, అవినాకువద్దు. నాడెంగా నాణ్యాలూ తండులాలూ పడెయ్యండి' అని దాతల్ని హెచ్చరించాను. అంటే వాళ్ళంతాకూడా 'ఓయి! వెంబరివిత్తా! కొప్పులోపువ్వులు గుప్పెట్లోపువ్వులు మావిమావే మీవిమీవే! మాదీమీదీ అయ్యేది నాణ్యాలమారక మొక్కటేనోయీ!' అని చిల్లఱగిరాటేశారు. 'బాబూ బ్రతికానురా నేను!' అని అదంతా మూటగట్టుకుని తిరిగి యింటికివెళ్ళి నేనే మూటవిప్పి భార్యముందుపోసి నాచేతుల్తో లెక్కెడుతూ వొక్కొక్కటే దానిచేతిలో పోశాను. పోస్తూవుంటే 'ఇదేందిరా! నీచేతిలో నాణెంగా వుండి నాచేతిలోకి వచ్చేసరికి పూనై పోతూవుంది! ప్రతీదీ!' అని వోపువ్వు వాసనచూచింది. కడుపునిండినట్టు గఱ్ఱున త్రేంచింది. ఓపువ్వు నాముక్కుదగ్గఱెట్టింది. నేను దానికంటె ఎక్కువగా గఱ్ఱున త్రేంచాను. ఓ పువ్వు అది తల్లోపెట్టుకుంది. ఇల్లంతా వెలుగై పోయింది. ఓపువ్వు నామీదికి విసిరింది అది. నాకళ్ళకు మళ్ళీ ఎక్కళ్ళేని చూపు వచ్చేసింది.

ఆపాళంగా ఆచీకటి రేత్రే నాతలోదరి వీధిలోకీ పెరట్లోకీ పఱుగెత్తుకెళ్ళి 'నిన్నా మొన్నా మనంపారేశిన పువ్వులెక్కడున్నాయో చూపెట్టండీ! మీకు జ్ఞాపకంవుంటేను' అని గట్టిగా అఱవడం ప్రారంభించింది.

ఊళ్ళోవాళ్ళంతా చేరువకొచ్చి 'ఏంవస్తువు పోయింది ఆలానెమకుతున్నారు?' అని అడిగినారు. మేమిద్దఱం మాట్లాడకపోతే విస్తుపోయి 'చన్నప్పా! చెప్పు!' అన్నారు. ఏమని చెప్పేది?—వేదవల్లి పైకెదిగి ఆకాశాన్ని రాత్రులందు పువ్వులు పూస్తూవుందట కాదూ?—అన్నాను.

అందఱూకూడా 'ఎప్పట్నుంచి? ఎప్పట్నుంచి?' అని ప్రశ్నించడమే! చెప్పడానికి నాకూ నాభార్యకూకూడా సిగ్గయిపోయింది. గతరాత్రినుంచి అని చెప్పనా? గతరాత్రికింకా వెనకటిరాత్రినుంచి అని చెప్పనా?

చన్నప్పకు పేరెందుకు? చన్నప్పకు శిలావిగ్రహంఎందుకు? మఱెప్పట్నుంచి అనేచర్చ అలాకట్టిపెట్టి, ఆకాశానివి చుక్కలో పువ్వులో తెలియక కొట్టుమిట్టాడుతూ వున్నాను ఇప్పటికీ నేను' అని అన్నాడు.

'చెన్నప్పా! సెలవు' అన్నాను. లేందే అతను అక్కడనాముందు! నేను వదిలేసిన ఈజీచైర్? అదీలేదు! అక్కడ.